క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

బి.కొత్తకోట: బి.కొత్తకోట దర్గా వీధికి చెందిన మహబూబ్ బాషా గురువారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా వైఎస్సార్‌బీమా పథకం ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయన్ని కమిషనర్ పీఆర్.మనోహర్ అందజేశారు. మిగిలిన రూ.9 0వేలు బ్యాంకుఖాతాకు జమ అవుతాయని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, హౌస్‌బిల్డింగ్ సొసైటి మాజీ వైస్‌చైర్మన్ జీవి.రామకృష్ణ పాల్గొన్నారు.

288 మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా తనకల్లు మండలం బూడిదగడ్డ గ్రామానికి చెందిన వేంపల్లి గంగమ్మ (56) అనే మహిళ కాలిబాటన సంచితో నడచుకుంటూ వస్తుండగా పోలీసులు తనిఖీ నిర్వహించారు. అందులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన రూ.11,500ల విలువ చేసే 288 మద్యం ప్యాకెట్లు పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ల నిరసన

వాల్మీకిపురం: ఉచిత పథకాల పేరుతో, స్వార్థ రాజకీయాల కోసం ఆటో కార్మికుల కుటుంబాలను వీధిపాలు చేయొద్దని అంటూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో కలసి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యక్షంగా పరోక్షంగా రూ.10 లక్షల పైబడి ఆటో రంగం మీద ఆధారపడి జీవిస్తున్న కార్మికుల కుటుంబాలను స్వార్థ రాజకీయాల కోసం ఆటో కార్మికుల కుటుంబాలను వీధిపాలు చేసే ఆలోచనలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, బావాజాన్, నరసింహులు, రెడ్డిమూర్తి, నారాయణ, దేవలానాయక్, రెడ్డినాయక్, తదితరులు పాల్గొన్నారు.

జనవరి ఫస్ట్‌కు హార్సిలీ హిల్స్‌కు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: నూతన ఆంగ్ల సంవత్సరాదికి ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె-హార్సిలీహిల్స్‌కు 10 బస్సులు, అంగళ్లు-హార్సిలీహిల్స్‌కు 4 బస్సులు, కాండ్లమడుగు క్రాసు-హార్సిలీహిల్స్‌కు 8 బస్సులు, బి.కొత్తకోట- హార్సిలీహి ల్స్‌కు 4 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె- మల్లయ్యకొండకు 3, మదనపల్లె-బెంగళూరుకు 5 బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

తలకోనకు ..

పర్యాటక కేంద్రమైన తలకోనకు నూతన ఆంగ్ల సంవత్సరానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. సోమవారం ఉదయం 8, 9, 10 గంటలకు స్పెషల్ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సంస్థను ఆదరించాలని కోరారు.

ఐడీ కార్డులు పంపిణీ

పీలేరు : నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఐడీ కార్డులు పంపిణీ చేశారు. శుక్రవారం నియోజకవర్గ కన్వీనర్ రవి కుమార్, మండల కన్వీనర్ కన్వీనర్లు సునీల్‌రెడ్డి, వంశీకిషన్‌రెడ్డి, ఉబేదుల్లా, జగదీష్‌లకు గుర్తింపు కార్డులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ గూర్చి సోషల్ మీడియాలో విస్తృతస్థాయి ప్రచారం చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

నూతన నియామకం

పీలేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ పీలేరు మండల ప్రధాన కార్యదర్శిగా కోటపల్లెకు చెందిన గుర్రం సురేంద్రనాథరెడ్డిని నియమించినట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. పార్టీ అభివృద్ధికి సురేంద్రనాథరెడ్డి చేసి సేవలను గుర్తించి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ తన నమ్మకంతో పదవి కల్పించిన ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పశువులమంద స్థల సమస్య పరిష్కారం

పీలేరు : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్ ఎస్సీ కాలనీలో పశువుల మంద స్థల సమస్య పరిష్కారం అయింది. రెండు రోజుల క్రితం జరిగిన ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సమావేశంలో పశువుల మంద స్థల సమస్యపై అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన తహసీల్దార్ ధనుంజయలు ఆదేశాల మేరకు శుక్రవారం వీఆర్వో శాంతకుమార్‌రెడ్డి, సర్వేయర్ రామకృష్ణ స్థలాన్ని సర్వే నిర్వహించి 29 సెంట్లు స్థలం కబ్జాకు గురైనట్లు గుర్తించి గ్రామస్తులకు పశువుల మందకు హద్దులు చూపించారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, నాయకులు హరినాథ, ముల్లంగి గురవయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు సంకష్టహర గణపతి వ్రతం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం సంకష్టహర గణపతి వ్రతం జరుగుతుందని అర్చకులు ఫణికుమార్‌శర్మ తెలిపారు. సాయంత్రం జరిగే గణపతి వ్రతంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



యాలగిరిపల్లెలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించి అండగా నిలవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. శుక్రవారం బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లె పంచాయతీలోని జింకదాటినపల్లె, చెరువు ముందరపల్లె, ఓబిశెట్టిపల్లె, వలసగుట్టపల్లె, సేతురావుపల్లె, గురికానిపల్లె, దబ్బలవారిపల్లె, ఒడిగెద్దులవారిపల్లె, యాలగిరివారిపల్లె, చింతమాకులపల్లెల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందారా అని అడిగి తెలుసుకొన్నారు. జగన్ పాలనలో అన్ని సౌకర్యాలు పొందుతున్నామని ఎమ్మెల్యే ఎదుట సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు స్థానిక సమస్యలను ప్రస్తావించగా పరిష్కారం కోసం అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో మమేకమయ్యారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ప్రజల సంక్షేమాన్ని పట్టించుకుందా అని ప్రశ్నించారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరు మండలాల్లో తారురోడ్డు లేని పల్లె లేకుండా చేసిన ఘనత ప్రభుత్వానిదన్నారు. వచ్చే 20 ఏళ్లదాక తారురోడ్డు అవసరం లేకుండా అభివృద్ధి చేశామని అన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని కోరారు.

తంబళ్లపల్లెకు కృష్ణాజలాలు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో వచ్చే రోజుల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం కృష్ణా జలాలతో కళకళలాడుతుందన్నారు. హంద్రీనీవా-గాలేరు నగరి ప్రాజెక్టుల అనుసంధానం పనులు పూర్తయ్యాక గండికోట రిజర్వాయర్ నుంచి 13 టిఎంసీల కృష్ణా జలాలు తరలిస్తారన్నారు. ముదివేడు రిజర్వాయర్ పనులు పూర్తయ్యాక కృష్ణా జలాలతో నింపి, చెరువులకు నీటిని అందించే ప్రణాళిక ఉందని చెప్పారు. కరువుకు నిలయమని చెప్పుకునే తంబళ్లపల్లె పొలాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ శంకరయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.ప్రదీప్ రెడ్డి, సర్పంచు అదెన్న, ఎంపీటీసీలు ఎ.సుబ్బరాయప్ప, ఆకుల బాలకృష్ణ, ఏఈలు దినేష్‌కుమార్, లావణ్య, రజనీ, గిరిధర్, ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీ, ఏపీఓ మంజుల, ఏఓ చంద్రశేఖర్, ఆర్ఐ బాలాజీ, నాయకులు ఈ.రెడ్డిశేఖర్, పి.రాజన్న, కే.రాజన్న, జి.నారాయణస్వామి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధి మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణ పనులను శుక్రవారం తిరుపతి ఎస్వీయూ నివర్సిటీ వైద్యబృందం పరిశీలించింది. పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్. ఏఎస్.కిరీటి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ మాధవీలత తదితరులు ముందుగా శానిటోరియంలో జరుగుతున్న నూతన భవన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో జరుగుతున్న తాత్కాలిక మెడికల్ కళాశాల గదుల నిర్మాణాలను తనిఖీ చేశారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీధర్, సూపరింటెండెంట్ వి.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.బాబు, డీఈ కరీముల్లాఖాన్ లతో నిర్మాణపనుల ప్రగతిపై చర్చించారు. జనవరిలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ వైద్యబృందం కాలేజీ తనిఖీ నిమిత్తం వస్తోందని, ఆమేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణపనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్లు అనిత, శశికళ, అపర్ణ, మారుతి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల నిర్మాణ పనుల ప్రగతిపై డీఈతో చర్చిస్తున్న వైద్యబృందం

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

తంబళ్లపల్లె: మండలంలోని గుండ్లపల్లె, పరషతోపు గ్రామ పంచాయతీలలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. డీఎల్‌డీవో లక్ష్మీపతి, ఎంపీడీఓ సురేంద్రనాథ్ కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలపై వివరించారు. ప్రజల వాటినిసద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. మహిళలకు గ్యాస్‌స్టౌవ్ సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు మౌలాలి పార్వతమ్మ, ఎంపీటీసీ సరోజమ్మ ఏపీవో అంజనప్ప, ఏఈ అశోక్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బోటింగ్ బోణి అదిరింది

-రూ.9 లక్షలకు టెండర్ దాఖలు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యావరణ సముదాయంలోని మానస సరోవరంలో బోటింగ్ నిర్వహణ టెండర్‌కు అధికారులు ఊహించని ధర దక్కింది. వచ్చే జనవరి ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు బోటింగ్ నిర్వహణ బాధ్యతలను ప్రయివేటుకు అప్పగించేందుకు అటవీశాఖ డీఎఫ్ఓ పళణి వివేక్ నిర్ణయించారు. దీనిపై గురువారం రాజంపేట కార్యాలయంలో రెండు టెండర్లు దాఖలయ్యాయి. ప్రభుత్వం టెండర్ ధర రూ.6 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన వంశీధర్ రూ.6.60 లక్షలకు, కాండ్లమడుగుకు చెందిన రమేష్ రూ.9 లక్షలకు టెండర్ దాఖలు చేశారు. అధికధరకు టెండర్ దాఖలు చేసిన రమేష్‌కు బోటింగ్ లీజు బాధ్యతను అప్పగిస్తూ వివేక్ ఉత్తర్వులు జారీ చేసారని మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం చెప్పారు. పర్యావరణ సముదాయంలోకి ప్రవేశ రుసుము వసూలు లీజుకు టెండర్లు దాఖలు కాకపోవడంతో వాయిదా వేశామని తెలిపారు.

గాయపడిన నాయకుడికి పరామర్శ

మదనపల్లె : తంబళ్లపల్లె నియోజకవర్గంలో బీజేపీ నాయకుల మధ్య వర్గపోరులో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన బీజేపీ సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డిని రాష్ట్ర, జిల్లా బీజేపీ నాయకులు పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ బీజేపీ అధ్యక్షులు సాయిలోకేష్ శుక్రవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో గోపాల్‌రెడ్డిని ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారించారు. పార్టీలో గౌరవప్రదమైన హోదాలో, సీనియర్ నాయకుడిగా గుర్తింపు కలిగిన గోపాల్‌రెడ్డిపై దాడి దురదృష్టకరమన్నారు. బాధ్యులు ఎవరైనా కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఈ విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించి, నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు బండిఆనంద్, పులినరేంద్రకుమార్‌రెడ్డి, పోతుకుంటరమేష్‌నాయుడు, జర్మన్‌రాజు, ఆకులకృష్ణమూర్తి, యల్లంపల్లెప్రశాంత్, బాలసుబ్రహ్మణ్యంయాదవ్, భగవాన్ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పైకి బైక్, ఆటోలు నిషేధం

- నూతన వేడుకలకు రెండు రోజుల ఆంక్షలు
- మదనపల్లె డీఎస్పీ కేశప్ప



బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతారణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మదనపల్లె డీఎస్పీ కే.కేశప్ప వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొండపై రెండు రోజులు ఆంక్షలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేడుకలను పురస్కరించుకుని సాధారణ సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వశాఖల సిబ్బంది సహకరించాలన్నారు. డిసెంబర్ 31న కొండకింద తాత్కాలిక చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిర్వహకులు అతిథిగృహాల్లో మద్యాన్ని అనుమతించకూడదని, మద్యం సేవించాక ఏదైనా సంఘటనలు జరిగితే కఠినమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. 31వ తేది రాత్రి, జనవరి ఒకటిన ఎవరైనా కొండపై బహిరంగంగా మద్యం సేవించినా, మద్యం సేవించి బైక్ రైడ్ చేస్తూ సందర్శకులకు ఇబ్బందులు కలిగించినా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై చలిమంటలు వేయకూడదని అతిథిగృహాల యజమానులను కోరారు. అతిథిగృహాల్లో విందులు, వినోదాల కోసం డీజే శబ్దాలతో ఇబ్బంది కలిగిస్తే సందర్శకులు, వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కొండపైకి రెండురోజులు మద్యం తీసుకెళ్లడం కూడా నిషేధమని చెప్పారు. ప్రమాదాల నివారణకు బైక్, ఆటోలను కొండపైకి వెళ్లడానికి నిషేధమని చెప్పారు. వీటిని చెక్‌పోస్టు వద్దే నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. సంబరాలు జరపుకునే సందర్శకుల భద్రత కోసం 50 మంది పోలీసులు, నలుగురు ఎస్ఐలు, ఒక సీఐ బందోబస్తు విధుల్లో ఉంటారని చెప్పారు.

ఆటలతో పాటు చదువులోనూ రాణించాలి

తంబళ్లపల్లె: విద్యార్థులు ఆటలతో పాటు చదువులోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఉమర్ ఫరూఖ్ తెలిపారు. శుక్రవారం గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కులపై అవగాహన ఉన్నప్పుడే హక్కులు సాధించుకోగలరన్నారు. విద్యార్థులు ర్యాగింగ్, ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినా చర్యలు ఉంటాయన్నారు. మత్తు, చెడు వ్యవసనాలకు బానిసకావద్దన్నారు. గతంలో పాఠశాల నుండి రాష్ట్రస్థాయి ఆటలపోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసపత్రం అందజేస్తున్న న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

మదనపల్లె : ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మదనపల్లె మండలంలోని 13 సచివాలయాల పరిధిలో 21 క్రీడాపోటీలు జరిగాయి. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఆటలకు సంబంధించి పోటీలు జరిగితే వాటిలో పలువురు తమ క్రీడాప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ... మండల స్థాయిలో పోటీలకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన క్రీడాపోటీల్లో బెస్ట్‌ప్లేయర్స్‌ను ఎంపిక చేయాల్సిందిగా జేసీ ఆదేశించారన్నారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో 43 టీమ్‌లు జెడ్పీహైస్కూల్, టిప్పుసుల్తాన్ మైదానం, జీఆర్‌టీ, బీటీ కాలేజ్ గ్రౌండ్స్‌లో.. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటలు ఆడటం జరిగిందని కమిషనర్ కే.ప్రమీల తెలిపారు.

వాల్మీకిపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడాకారుల ప్రతిభకు పట్టం కట్టే వేదిక అని సర్పంచ్ గంగులమ్మ, మాజీ జెడ్పీటీసీ చింతల శివానంద రెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయం 3 పరిధిలో స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే ఈవెంట్ ద్వారా 5 విభాగాల్లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించడం చరిత్రాత్మకమన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు.

కేవీపల్లె : రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిసినట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 2722 మంది పురుషులు, 1165 మంది మహిళలు, అలాగే 240 పురుషుల టీములు, 118 మహిళల టీములు క్రీడల్లో పోటీ పడినట్లు చెప్పారు.

రామసముద్రం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు గ్రామీణుల ప్రతిభ గుర్తించేందుకే అని సర్పంచ్ రెడ్డెప్పనాయుడు , ఉపసర్పంచ్ దొరబాబు తెలిపారు. శుక్రవారం పెద్దకురప్పల్లె పంచాయతీ మట్లవారిపల్లె జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఖోఖో పోటీలు పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కలికిరి: క్రీడాకారులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతోందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. మండలంలోని కలికిరి-1 గ్రామ సచివాలయ పరిధిలో క్రీడా పోటీలను శుక్రవారం కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆయన ప్రారంభించారు. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని గుండ్లూరు, అద్దవారిపల్లి, చీకటిపల్లి గ్రామ సచివాలయాల్లోనూ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమాలలో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, చీకటిపల్లి సర్పంచ్ సీకాం సురేంద్రనాథరెడ్డి, అద్దవారిపల్లి సర్పంచ్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



రామసముద్రం: ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ప్రగతి పథంలో రాష్ట్రం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీలేరు పట్టణంలోని కోటపల్లె, జీవీ చంద్రశేఖర్‌రెడ్డి నగర్‌లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి అందించిన పథకాలు లబ్ధిదారులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి కుటుంబం ఏదోవిధంగా ఆర్థికంగా ప్రయోజనం పొందినట్లు చెప్పారు. మీకు ప్రభుత్వం నుంచి మంచి జరిగి ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ కుట్రలు పన్నుతున్నారని, ప్రజలు ఎవరూ మోసపోరాదని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు యదావిధంగా కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని నిండుమనస్సుతో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అప్పటికప్పుడే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి .శ్రీనాథరెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి, దండు జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్ బాషా, మహితా ఆనంద్, సుధాకర్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నవీన్ రెడ్డి, హుమయూన్, రమణ, లక్ష్మణ్‌రెడ్డి, కంభం భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణతోనే రోగులకు సరైన చికిత్స

– డీపీఎంఓ డాక్టర్ రియాజ్‌బేగ్

మదనపల్లె : వ్యాధి నిర్ధారణతోనే రోగులకు సరైన చికిత్స అందించగలుగుతామని డీపీఎంఓ డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని డైక్ సెంటర్‌లో డివిజన్‌లోని ఏఎన్ఎంలకు హెచ్‌బీ మీటర్ల వినియోగం, రోగనిర్ధారణ పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హిమోగ్లోబిన్ టెస్టింగ్‌లపై ఏఎన్ఎంలకు జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలోని ఆస్పత్రుల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మదనపల్లె డివిజన్ పరిధిలోని 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని 202 సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు శిక్షణలో భాగంగా హెచ్‌బీ మీటర్స్ సర్వీస్ ఇంజనీర్ ఏ.మహబూబ్‌బాషా అవగాహన కల్పించారు. అనంతరం రియాజ్‌బేగ్ మాట్లాడుతూ.. జిల్లాలోని 501 సచివాలయ ఏఎన్ఎంలకు హెచ్‌బీ మీటర్స్ పంపిణీ జరిగిందన్నారు. వాటి పనితీరు, ఉపయోగించే విధానం రోగుల నుంచి రక్తం సేకరించడం, కోడింగ్ ఇవ్వడం, హెచ్‌బీ రీడింగ్, క్రాస్‌చెక్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ట్రైనింగ్ నోడల్ అధికారులు డాక్టర్.అనుపమ, డాక్టర్.శ్రీధర్ మాట్లాడుతూ.. గర్భవతులు, కిశోరబాలికలు, రోగుల్లో హెచ్‌బీ రీడింగ్‌లను పట్టి వారి ఆరోగ్యపరిస్థితి నిర్ధారణ అవుతుందన్నారు. సరైన హెచ్‌బీ రీడింగ్‌తో మెరుగైన వైద్యచికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.



ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ డాక్టర్ రియాజ్‌బేగ్

అన్నిరకాల పంటల సాగుకు అనుకూలం

– కేంద్రజలశక్తి నోడల్ అధికారి ప్రకాష్‌కిచ్చి

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా అన్ని రకాల పంటలను సాగు చేసుకొనేందుకు అనుకూలంగా ఉందని కేంద్ర జలశక్తి నోడల్ అధికారి ప్రకాష్ కిచ్చి అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన గుర్రంకొండలో కేంద్రం బృందం సభ్యులు పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను సందర్శించారు. 17ప్రభుత్వ శాఖలకు చెందిన ప్రదర్శనశాలలో అక్కడి ఏర్పాటు చేసిన పరికరాలు, వస్తువులు, పంటల గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద చేయూతను అందిస్తోందన్నారు. జలజీవన్ మిషన్ పథకం కింద ప్రతి గ్రామానికి తాగునీరు, కొళాయిలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రైతులకు పీఎం కిసాన్ పథకం కింద ఏటా రూ.13500 అందిస్తున్నామన్నారు. పీఎం యోజనా పథకం యువతకు బ్యాంకు రుణాలతోపాటు యువ పారిశ్రామిక వేత్తలకు రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పీడీ ధన లక్ష్మీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, జిల్లా సర్వేఅధికారి జయరాజ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, ఎంపీపీ సీతమ్మ, మ మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ మైమున్నిసా రైతులు పాల్గొన్నారు.



గుర్రంకొండలో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలో వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న అధికారులు

కురుబల అభివృద్ధికి విశేష కృషి

మదనపల్లె : కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్రంలోని కురబల సంక్షేమానికి, కుల, రాజకీయ అభివృద్ధికి విశేష కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు జబ్బలశ్రీనివాసులు తెలిపారు. స్థానిక కురబ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్త కనకదాసు 536వ జయంతి వేడుకలు, ఏపీ కురుబసంఘం 8వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజ్యసభ సభ్యులు, బీసీ జాతీయసంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కురబలకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షులు కప్పలరాజన్న, పట్టణ అధ్యక్షులు గుడిరామాంజులు, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, పుంగనూరు పట్టణ యువత అధ్యక్షులు రంగా, తంబళ్లపల్లె శ్రీనివాసులు, కొప్పలహరినాథ్, వెంకటరమణ, వల్లిగట్లవెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

ఆలయాలు, కమ్యూనిటీ భవనాలకు మహర్దశ

- ఎంపీ, ఎమ్మెల్యే కృషితో అభివృద్ధి
- సిమెంటు రోడ్లు ఏర్పాటు
- కమ్యూనిటీ భవనాలకు రూ.లక్షల నిధులు



ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనం

పెద్దతిప్పసముద్రం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిల కృషితో మండలంలోని పలు ఆలయాల రూపు రేఖలు మారిపోయాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు తమవంతు సాయంగా ఆలయాల అభివృద్ధికి రూ.లక్షల్లో వారి సొంత నిధులను అందజేశారు. ఇదిలా ఉండగా ఎంతో చరిత్ర కలిగిన పురాతన ఆలయాలు శిథిలావస్థకు చేరుకుని నిత్య పూజలకు నోచుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజల సూచనల మేరకు ఎమ్మెల్యే రూ.కోట్ల నిధులు మంజూరు చేయించి దైవభక్తిని చాటుకున్నారు.

రూ.4.90 లక్షలతో కమ్యూనిటీ భవనం :

మండలంలోని అంకిరెడ్డిపల్లి సమీపంలో మొరుసు కాపుల ఇలవేల్పు దైవంగా భావించే శ్రీ భైరవేశ్వర స్వామి ఆలయం రూ.1.50 కోట్లతో నిర్మించారు. మండల వాసులే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా మొరుసు కాపులు ప్రతి ఏటా వేల సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహిస్తారు. గతంలో ఈ ఆలయ విగ్రహ ప్రతిష్టా పూజలకు విచ్చేసిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మొరుసు కాపుల కోరిక మేరకు కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ.4.90 లక్షల నిధులు మంజూరు చేయగా వాటి నిర్మాణం కూడా పూర్తయింది. అంతేగాక భక్తుల సౌకర్యార్థం అంకిరెడ్డిపల్లి మెయిన్ రోడ్డు నుంచి 1.20 కిలోమీటర్ల దూరం ఉన్న ఆలయం వరకు సిమెంటు రోడ్డు మంజూరుకు ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతిరాజ్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణం స్పందన



ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ప్రజా సమస్యలపై తక్షణం స్పందించి వాటి ని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారు. మండలంలోనే అతి చిన్న పంచాయతీలో వెలసిన భైరవేశ్వర స్వామి ఆలయ కమ్యూనిటీ భవనానికి ఎంపీ రూ.4.90 లక్షల నిధులు మంజూరు చేశారు. అడగకపోయినా ఆలయం వరకు సిమెంటు రోడ్డుకు చొరవ చూపుతున్నారని అధికారులు చెప్పే వరకూ మాకు తెలియదు. **- భాగ్యమ్మ, సర్పంచ్**

పెద్దిరెడ్డి కుటుంబానికి దైవభక్తి ఎక్కువ



పెద్దిరెడ్డి కుటుంబానికి దైవభక్తి ఎక్కువ. మండలంలోనే గాక తంబళ్ళపల్లి నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఎక్కడ పర్యటించినా ఆలయాల అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలు కోరితే సొంత నిధులను ఇస్తున్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా కూడా నిధులను మంజూరు చేసి మానవత్వం చాటుకునే మనస్తత్వం ఆ కుటుంబానిది.

-విశ్వనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, అంకిరెడ్డిపల్లి